www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 15 నవంబర్ 2025
5
చిత్తూరు



వరసిద్ధుని సేవలో డిప్యూటీ సీఎం ఓఎస్‌డి

ప్రజాశక్తి- ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని రాష్ట్ర డిప్యూటీ సీఎం ఓఎస్డి మధుసూదన్ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో పెంచల కిషోర్ వారికి స్వాగతం పలికి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, పట్టువస్త్రంను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఐరాల ఎంపీడీవో, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, ఉన్నారు.



స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈవో

ప్రజలకు రక్షణ అందించడమే లక్ష్యం

కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించిన ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను జిల్లా ఎస్పీ తుషార్ డూడి శుక్రవారం సందర్శించి పని తీరును పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా చిత్తూరు ప్రజలకు 24/7 రక్షణ అందించడమే చిత్తూరు జిల్లా పోలీసుల ధృడసంకల్పమని తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణ కోసం అత్యాధునిక సాంకేతిక పద్ధతులతో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను జిల్లా ఎస్పీ శుక్రవారం సందర్శించారు. ఈ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నియంత్రణ వ్యవస్థ, ట్రాఫిక్ మానిటరింగ్ వ్యవస్థ, ఎమర్జెన్సీ రెస్పాన్స్ మెకానిజం వంటి అంశాలను పరిశీలించారు. సెంటర్ నెట్‌వర్క్‌కు అనుసంధానించబడిన నగరంలోని ముఖ్య కూడళ్లలో ఉన్న సీసీ కెమెరాల దశ్యాలను లైవ్‌గా పరిశీలించి, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, బాలికల రక్షణ కోసం రూపొందించిన శక్తి యాప్‌లో అత్యవసర సమయంలో సంకేతం ద్వారా ఫిర్యాదులు అందిన వెంటనే కంట్రోల్ సెంటర్ సిబ్బంది పనితీరును పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, ఎస్ఐలు సురేంద్ర, మోబీన్ తాజ్, సిబ్బంది పాల్గొన్నారు.



కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

ప్రీస్కూల్స్‌ను బలోపేతం చేయాలి: సిఐటియు



చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అంగన్వాడీ కేంద్రాలలోని ప్రీస్కూల్ పిల్లల సంఖ్య తగ్గిపోతోందన్న కారణం చూపి అంగన్వాడీ సెంటర్లను విలీనం చేయాలని ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలని ప్రీ స్కూల్స్‌ను బలోపేతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అన్ని సచివాలయాల వద్ద వినతిపత్రాలు అందజేయడం జరిగింది. చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని సచివాలయంలో వినతిపత్రం ఇచ్చి అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ మూడు నుండి ఆరు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్వాడీ సెంటర్లో ఉండే విధంగా ప్రభుత్వం జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కాన్వెంట్లకు కూడా జీవో ఇవ్వాలని, ప్రీస్కూల్ పిల్లలకు తల్లికి వందనం చేయాలని, అంగన్వాడీ పిల్లలకు ఇచ్చే మెనూ ఏమాత్రం సరిపోవడం లేదని, మెనూ క్వాంటిటీ పెంచాలని, ప్రీస్కూల్ పిల్లలకు యూనిఫామ్, షూలు ఇవ్వాలని కోరారు. అంగన్వాడీలకు అదనపు పని తగ్గించి ఆన్లైన్ వర్క్ ఆపాలని కోరారు. సమస్యలను పరిష్కరించకుంటే భవిష్యత్తులో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రీస్కూల్‌ను పాఠశాలలో కలపొద్దు

చంటి పిల్లలు, గర్భవతులు, బాలింతలకు సేవలందిస్తున్న ఐసిడిఎస్‌ను బలోపేతం చేసి అంగన్వాడీల సేవలను విస్తృతం చేయాలని కోరుతూ శుక్రవారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపుమేరకు యాదమరి మండలం మాదిరెడ్డిపల్లి సెక్టార్ 12 కమ్మపల్లి సచివాలయంలో జిల్లా కార్యదర్శి షకీలా ఆధ్వర్యంలో సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రీ స్కూల్‌ను బలోపేతం చేయాలని పాఠశాలలో కలపవద్దని కోరారు.



యాదమరిలో..

'ప్రధాన'ంగా అందరూ అగ్రవర్ణాలే...

నామినేటెడ్ పదవుల్లో చోటేది...

చంద్రబాబుపై దళితుల అసంతృప్తి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: ఉమ్మడి జిల్లాలో టిడిపికి చెందిన దళిత నాయకులు చంద్రబాబుపై అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పెత్తందారులకే పదవులు పట్టం గడుతున్నారని కినుక వహిస్తున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఇప్పటివరకూ తుడ, తిరుపతి గంగమ్మ, బోయకొండ, శ్రీకాళహస్తి, కాణిపాకం పాలకమండళ్లలోనూ 'రెడ్డి', 'నాయుడు' , 'బలిజ' సామాజికవర్గాలకే పెద్దపీట వేశారన్నది వారి ఆవేదన. ముఖ్యంగా చిత్తూరు డిసిసి బ్యాంకు ఛైర్మన్‌గా ఇతర పార్టీ నుంచి వలసొచ్చిన అమాస రాజశేఖర్‌రెడ్డికి పట్టం కట్టారు. రాష్ట్రవ్యాప్తంగా పది కార్పొరేషన్లను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన 122 డైరెక్టర్ పదవుల్లోనూ ఒక్క దళితుడు కూడా లేకపోవడం బాధాకరమని చర్చించుకోవడం గమనార్హం. అంబేద్కర్ రిజర్వేషన్ తీసుకురావడం వల్ల ఓటేయడానికి తప్ప ఒరిగిందేమీ లేదన్నది వారి ఆవేదన. రిజర్వేషన్ పుణ్యమా అని గూడూరు, సత్యవేడు, సూళ్లూరుపేట, జీడీనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో దళితులకు ఇచ్చారే తప్ప ప్రత్యేకించి పెద్దపీట వేసిన దాఖలా లేదు. టిడిపి ఏర్పడినప్పటి నుంచి నేటివరకూ ఒక్క దళితుడు కూడా జిల్లా పార్టీ అధ్యక్షులుగా లేరని నియోజకవర్గానికి చెందిన ఓ ప్రముఖ నాయకుడు 'ప్రజాశక్తి'తో కామెంట్ చేయడం గమనార్హం. ఒకటీ అర 'బీసీ'లకు కేటాయించినా, దళితులకు ఒక్క పదవి కూడా ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. తుడా ఛైర్మన్‌గా డాలర్స్ దివాకర్‌రెడ్డి, డిసిసి బ్యాంకు ఛైర్మన్‌గా అమాస రాజశేఖర్‌రెడ్డి, చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్‌గా కఠారి హేమలత, కాణిపాకం ట్రస్టు బోర్డు ఛైర్మన్‌గా మణినాయుడు, శ్రీకాళహస్తి బోర్డు ఛైర్మన్‌గా కొట్టే సాయి, టిటిడి బోర్డు సభ్యునిగా భానుప్రకాష్‌రెడ్డి, వైద్యం శాంతారాం, బోయకొండ గంగమ్మ ఛైర్మన్‌గా పత్తిరాజు, గంగమ్మ గుడి ఛైర్మన్‌గా మహేష్‌యాదవ్ ఉన్నారు. యాదవ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ నరసింహయాదవ్, వన్నెకుల క్షత్రియ వెల్ఫేర్ బోర్డు రాష్ట్ర ఛైర్మన్ సిఆర్ రాజన్, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర ఛైర్మన్‌గా ఎం.సుగుణమ్మ, హస్తకళల గ్రామీణాభివృద్ధి రాష్ట్ర ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, రెస్కో ఛైర్మన్‌గా ప్రతాప్, కుప్పం తిరుపతి గంగమ్మ గుడి ఛైర్మన్‌గా విఎస్‌కె రవిచంద్రబాబు, కుప్పం మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా మునిరాజులను ప్రకటించారు. నామినెటెడ్ పదవుల్లో దళితులకు చోటు దక్కకపోవడం ఆ సామాజికవర్గంలో ఆగ్రహాన్నే కలిగిస్తోంది.

ఆరోగ్యానికి (సు)రక్ష

డ్వాక్రా మహిళలకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: 'సురక్ష ఆరోగ్యానికి రక్ష'.. అంటూ రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించనుంది. సఖి సురక్ష పేరిట స్వయం సహాయ సంఘాల్లోని 35 సంవత్సరాలు పైబడిన మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచిత వైద్య అందించనుంది. జాతీయ అర్బన్ ఆరోగ్య మిషన్ సహకారంతో ఈ-వైద్య ప్రైవేట్ లిమిడెట్ భాగస్వామ్యంతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయ సంఘాల్లోని 35 సంవత్సరాలు పైబడిన మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించనుంది. అలాగే జిల్లాలోని మున్సిపాలిటీల్లో వైద్యపరీక్షా శిబిరాలను ఏర్పాటు చేసిన పరీక్షలు నిర్వహించన్నారు. ముఖ్యంగా నగరాల్లోని మురికివాడల్లోని మహిళలకు ప్రాధాన్యత ఇస్తారు. అర్బన్ ప్రాంతాల్లోని అర్బన్ హెల్త్ సెంటర్లలో




పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంతో పాటు ఈ -వైద్య ప్రైవేట్ లిమిటెడ్ బృందం ఈ వైద్య పరీక్షలు నిర్వహించనుంది.

వైద్య పరీక్షలివే..

ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలకు నిర్వహించే వైద్యపరీక్షలు రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, కొలస్ట్రాల్, గుండెజబ్బులు, దీర్ఘకాలిక వ్యాధులులతో పాటు మహిళలు మాసిన వ్యాధులతో బాధపడుతున్నారా అనే విషయాలను కౌన్సిలింగ్ ద్వారా గుర్తిస్తారు. ఇలా పరీక్షలు నిర్వహించి సంబంధిత రిపోర్టులను వారి ఆధార్ అనుసంధానం ఫోన్‌నెంబర్‌కు పంపుతున్నారు. వైద్యపరీక్షలు చికిత్స అవసరమైన వారిని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తారు. ఆరోగ్య పరీక్షల రిపోర్టులను డిజిటలైజ్ చేసి అయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ క్రింద ప్రత్యేక ఆరోగ్య కార్డులు అందించనున్నారు. రూ.5లక్షల వరకు ఆరోగ్యబీమా ఉంటుంది. ఏడాదికి కనీసం నాలుగు సార్లు టెలికన్సల్టేషన్ సేవలు అందుబాటులో ఉంటాయి. హెల్త్ సీఆర్పీలు ఆరోగ్య పరిస్థితిని గమనిస్తూ వైద్య అవసరమైన వారిని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు పంపుతారు. మరో వైపు ఏ చిన్న పాటు వైద్యం కోసమైనా వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. సభలు సమావేశాలు, ప్రభుత్వ కార్యక్రమాలను జనం కోసం స్వయం సహాయ సంఘాల సభ్యులను తరలించే ప్రభుత్వాలు వివిధ సమస్యలతో బాధపడుతున్న మహిళలకు వైద్యఆరోగ్య పరీక్షలు, ఉచితంగా వైద్యం అందించడం కోసం ఉద్దేశించిన సఖీ సురక్ష పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించి మహిళా ఆరోగ్యన్ని కాపాడాలని స్వయం సహాయ సంఘాల మహిళలు కోరుతున్నారు.

గొర్రెల పెంపకందారులను ఆదుకోవాలి

కొత్త రుణాలు మంజూరు చేయాలని ఛైర్మన్‌కు వినతి



ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సొసైటీ అధ్యక్షులు గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని గొర్రెల మేకల పెంపకందారులకు నూతన రుణాల ఇచ్చి ఆదుకోవాలని శుక్రవారం చిత్తూరు జిల్లా గొర్రెల మేకల పెంపుదారుల సహకార యూనియన్ జిల్లాలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, 550 జీవో ప్రకారం బంజరు భూములను పెంపకందారులు కేటాయించాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు నిండిన పెంపకందారులకు పింఛన్లు ఇవ్వాలని, వర్షాలు తుపాను ప్రభావం వల్ల నష్టపోయిన పెంపకందారులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఆరు నెలలకు ఒకసారి పేరుకే సమావేశాలు జరుగుతున్నాయి తప్ప ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు పెంపకదారులకు అందకపోవడంతో సమావేశాలకు రావడానికి కూడా సుముఖంగా లేరని తెలిపారు. ప్రభుత్వం లక్ష్యం నీరుగారిపోతున్నా పశుసంవర్ధక శాఖ ఏమాత్రం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ పథకాలను పెంపకందారులకు అందే విధంగా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని అన్నారు. జిల్లాలో 257 సొసైటీలు ఉన్నప్పటికీ ప్రయోజనం అంతంత మాత్రమే అని పెంపకందారులను సొసైటీలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం, జిల్లా అధికారులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా పశుసంవర్ధక శాఖ ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు.

సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు వాడ గంగరాజు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల మేకల పెంపకందారులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందించకుంటే సొసైటీలు ఎలా బలోపేతం అవుతాయని ప్రశ్నించారు. గతంలో పోరాటం చేసి సాధించిన జీవోలను కూడా అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు.


ప్రజాసమస్యలపై వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ వారి కార్యాలయంలోని ప్రజాదర్బార్‌లో శుక్రవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. మున్సిపల్ డీఈ రమణ, హౌసింగ్ డీఈ శ్రీధర్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల అందించిన అర్జీలపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. అధికారులు అర్జీలను క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మొత్తం 11 అర్జీలు అందాయి. ఎమ్మెల్యే సహాయకులు కుమారస్వామి యాదవ్, టిడిపి నగర అధ్యక్షులు నరేష్, నాయకులు సుబ్రి, గోపాలకృష్ణ, లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

వేద విద్యార్థులకు వస్త్రాలు పంపిణీ



ప్రజాశక్తి -తిరుమల: తిరుమలలోని ధర్మగిరిలో ఉన్న వేద విజ్ఞానం పీఠంలో వేద విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి శుక్రవారం వస్త్రాలను పంపిణీ చేశారు. సంవత్సరానికోసారి వేద పాఠశాలలోని విద్యార్థులకు టీటీడీ వస్త్రాలు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా 4 పంచెలు, ఒక దుప్పటి చొప్పున 380 మంది విద్యార్థులకు అదనపు ఈవో పంపిణీ చేశారు. శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, వేద విజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ శివ సుబ్రహ్మణ్య అవధాని, పాల్గొన్నారు.

పసిపిల్లల గుండెజబ్బులపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: భారతదేశంలో ప్రతి 1000 మంది చిన్నారులలో ఎనిమిది మందికి పుట్టుకతో గుండె జబ్బులు వచ్చే అవకాశాలు వుంటాయని, అందులో 90శాతం మందికి ఆపరేషన్లు చేయాల్సిన అవసరం రావచ్చునని, కావున ప్రతి ఒక్కరూ వీటిపై అవగాహన పెంచుకుని చిన్నపిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని స్విమ్స్ సంచాలకులు ఆర్.వి.కుమార్ అన్నారు. బాలల దినోత్సవం పురస్కరించుకుని స్విమ్స్ సిటీ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో 'పదిలం పదిలం పసిహృదయం'అంటూ చిన్నపిల్ల గుండె జబ్బులపై అవగాహన కల్పించారు. రెండురోజుల పోస్టర్ ప్రదర్శన శుక్రవారం ప్రారంభమయ్యింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ ఈ ప్రదర్శన ఉంటుందని, ఆస్పత్రికి వచ్చే రోగులు, వైద్య విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించి అవగాహన పెంచుకోవాలన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత


- ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి


ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరం గిరింపేటలోని మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు మోహన్ అధ్యక్షత వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి గుణశేఖర్ రెడ్డి, జిల్లా ప్రొబేషన్ అధికారి లక్ష్మీపతి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం, సీడీపీఓ శ్యామ సుగుణ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, సఖి కేంద్ర సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ పోటీలలో విజేతలైన పిల్లలకు ప్రశంసా పత్రాలు, పతకాలు, స్మృతిచిహ్నాలు అందజేశారు. అలాగే అకడమిక్‌లో మంచి పప్రతిభ కనబరచిన విద్యార్థులకు అతిథులు పుస్తకాలు బహుకరించారు.

విజయం విద్యాసంస్థల్లో.. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం విజయం దిస్కూల్‌లో విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



చిత్తూరులో..

పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో బాలల దినోత్సవం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జీవనజ్యోతి చేతులు మీదుగాఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులకు రూ.1000ల చొప్పున నగదు బహుమతిని అందజేశారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవుల నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం గుడిపాల మండలం నరహరిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు క్రీడా పరికరాలను అందించారు. ఎంఈవో గణపతి, పాఠశాల హెచ్ఎం దుర్వాసులు, టిడిపి ఉపాధ్యక్షులు ధనసింగ్, పాఠశాల కమిటీ ఛైర్మన్ టిఆర్ డిల్లీబాయి పాల్గొన్నారు.



వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎగువ గెరిగిదొన ప్రభుత్వ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు గురునాథం నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి ఆయన సాధించిన విజయాలు పిల్లలకు తెలియజేశారు. ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

పూతలపట్టు: అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ఘనంగా బాలల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడి కేంద్రానికి వచ్చే విద్యార్థి తండ్రి వాసు కేకు తెచ్చి విద్యార్థులచేత కట్ చేయించి పంచిపెట్టారు. అలాగే పిల్లలకు చాక్లెట్లు పంచిపెట్టారు.

శాంతిపురం: మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు



శాంతిపురంలో..

పాఠశాలల్లో ఘనంగా బాలల దినోత్సవం జరుపుకున్నారు. పరమహంస యోగానంద విద్యాలయం, పరమహంస యోగానంద పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆజాద్ హుస్సేన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

సోమల: బాలల దినోత్సవం సందర్భంగా మండలంలోని ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు పిఆర్ శ్రీదేవి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. మాజీ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలోని చిన్నారులకు ఆట పోటీలు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. అలాగే విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు.



కార్వేటినగరంలో..

కార్వేటినగరం: బాలల దినోత్సవం డీఎం.పురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం నాథముని రెడ్డి, సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు బొజ్జా రాము నెహ్రూ జీవిత విశేషాలను స్వాతంత్ర్య ఉద్యమ నేపథ్యాన్ని విద్యార్థులకు వివరించారు. వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు సరస్వతి, కలైవాణి, రవి, రాములు, కిషోర్ కుమార్, రంజిత్ కుమార్, బొజ్జా రాము పాల్గొన్నారు.

యాదమరి: బాలల దినోత్సవం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయ సంఘనాయకులు కనకాచారి, వై.మాధుసూధన్, భాస్కర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఎపి.లలిత, వై.యూసఫ్, జె.హిమబిందు, సి.రమేష్, షకీల్ అహ్మద్, సురేష్ రెడ్డి పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లిలో..

బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కనపల్లి పంచాయతీ కేంద్రంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన బాలల దినోత్సవం కార్యక్రమంలో పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యాభ్యాసంలో క్రమశిక్షణ, ఆసక్తి, లక్ష్యసాధన ఎంతో ముఖ్యమని సూచించారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు డీఎస్పీ బహుమతులు ప్రదానం చేశారు. టిడిపి నాయకుడు కిషోర్ గౌడ్, పలమనేరు రూరల్ సిఐ పరశురాముడు, పాఠశాల కరస్పాండెంట్ రఘు చంద్రగుప్త పాల్గొన్నారు.

కుప్పం: చదువుతోపాటు విద్యార్థులకు సంస్కారం ఎంతో ముఖ్యమని అడవి బూదుగూరు పాఠశాల హెచ్ఎం చిట్టిబాబు పేర్కొన్నారు. భారత మాజీ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ 136వ జయంతి వేడుకలను పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఉపాధ్యాయులు నవీన్, జయశ్రీ పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ జగదీష్, సుమలత తదితరులు పాల్గొన్నారు

పెద్దపంజాణి: మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబురెడ్డి విద్యార్థులకు ఆట పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు ఇందిరా, తేజోవతి, ఫహీమున్నిసా, నాగరాజు పాల్గొన్నారు.

12-14 తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తిరుపతి వేదికగా డిసెంబర్ 12, 13,14 తేదీలలో జరగబోయే ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పట్టణ కార్యదర్శి గురవయ్య పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల గోడ పత్రికలను, కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రపంచ బ్యాంకు, కార్పొరేటీకరణకు అనుకూలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నాయని గురవయ్య మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఇందులో భాగమేనన్నారు. ప్రభుత్వ రంగ విద్యా వ్యవస్థను కాపాడుకునేందుకవసరమైన పలు తీర్మానాలను మహా సభల్లో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.30 కోట్ల విలువైన భూమిలో ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీ స్వామి హథీరాంజీ మఠంకు చెందిన 30 కోట్ల విలువైన భూమిలో శుక్రవారం మఠం పరిపాలన అధికారి బాపిరెడ్డి ఆదేశాలతో ఏఈవో కష్ణారెడ్డి, మఠం సూపరింటెండెంట్ కేశవులు ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలను అడ్డుకొన్నారు. తిరుపతి గ్రామీణ మండలం సర్వేనెంబర్ 17/3లో ఉన్న 2.20 ఎకరాల భూమిలో కొంతమంది అనధికారికంగా డాక్యుమెంట్ల ద్వారా మఠం భూమిని అమ్మకాలు చేస్తున్నారని సమాచారం రావడంతో ఆక్రమణ జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి వారు చేస్తున్న అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేశామన్నారు. ప్రభుత్వం ఈ సదరు భూమిలో రిజిస్ట్రేషన్ లపై నిషేధం విధించిందని మఠం అధికారులు స్పష్టం చేశారు. ఇకపై ఎవరైనా మఠం భూమిని ఆక్రమించాలని ప్రయత్నం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసేలా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరికలు చేశారు. మఠం సిబ్బంది సీతారామయ్య, రమేష్, మధు, కిరణ్, విజయ్ నాయక్, వెంకటేష్, గంగాధరం తదితరులు పాల్గొన్నారు.



రేపు 'పావుకోళ్లు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరులో ఈ నెల 16వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు కళామందిరంలో ఉమ్మడిశెట్టి సాహిత్య పురస్కార వ్యవస్థాపకులు, కవి డాక్టరు ఉమ్మడిశెట్టి రాధేయ కవితా సంపుటి 'పావుకోళ్లు' పుస్తకాన్ని ఆవిష్కరణ దోర్నాదుల సిద్ధార్థ అధ్యక్షతన నిర్వహిస్తామని పలమనేరు రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఆర్ మాధవ్, డి కుమారస్వామి రెడ్డి తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి సాహితీ ప్రముఖులు డాక్టర్ అంకె శ్రీనివాస్ డాక్టర్ పెళ్లూరు సునీల్, డాక్టర్ జల్ది విద్యాసాగర్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, రాష్ట్ర తెలుగు భాషా పురస్కార గ్రహీత పలమనేరు బాలాజీ ఆవిష్కరిస్తారని వారు తెలిపారు. ముఖ్య అతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు, పి తులసీనాథం నాయుడు, తాతయ్య, పద్మశ్రీ ట్రస్ట్ శ్రీనాథ్, డాక్టర్ కవితశ్రీ, కెవిమేఘనాథ్ రెడ్డి, పెరిసెట్ల శివకుమార్ , భారతి కోడె, కృష్ణవేణి పరాంకుశం, గండికోట వారిజ, కె వీణా బాయి , గంటా మోహన్, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు యుగంధర్, గిరిధర మూర్తి, సుధా మురళి పాల్గొంటారని తెలిపారు. సాహితీ మిత్రు లందరూ విచ్చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆహ్వానిస్తున్నామని కోరారు.

టిడిపి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మండలంలోని భాగ్యలక్ష్మి కళ్యాణ మండపంలో టిడిపి మండల నాయకత్వం ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు ధరణి ప్రసాద్ మాట్లాడుతూ టిడిపి పార్టీనూతనంగా మండల నాయకత్వాన్ని ఎన్నుకుందని, గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో అధిక స్థానాల్లో టిడిపి విజయానికి కృషి చేస్తామన్నారు. అనంతరం వారిని దుశ్శాలువలతో సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాజీ ఏఎంసీ చైర్మన్ జయచంద్ర నాయుడు మండల గౌరవ అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ అమరావతి మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్ గౌడ్ నాయకులు నాగరాజు గౌడు, కమల్ నాథ్ రెడ్డి, రమేష్, గిరిబాబు, పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం నెల్లిమంద పంచాయతీ బురుజు పల్లి లో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి సప్తమ వార్షిక కళ్యాణ మహోత్సవం శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో వేదమంత్రాల నడుమ నిర్వహించగా భక్తులు కల్యాణోత్సవాన్ని కన్నుల పండుగగా తిలకించారు. శ్రీవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

మిట్టపల్లిలో స్వామిత్వ గ్రామసభ

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామ పరిధిలోని మిట్టపల్లి రెవెన్యూ గ్రామంలో స్వామిత్వ గ్రామ సభను పంచాయతీ కార్యదర్శి జయశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఇటీవల గ్రామంలో చేపట్టిన స్వామిత్వ సర్వేలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ కుంభాభిషేకం

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మండలం గుండ్ల నాయన పల్లి గ్రామంలో శుక్రవారం వినాయక స్వామి, ప్రసన్న మారెమ్మ, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన, ఆలయ కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆలయ కుంభాభిషేకం సందర్భంగా దేవతామూర్తులకు పట్టు వస్త్రాలు సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుప్పం ప్రాంత దేవాలయాల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న సీఎం చంద్రబాబు కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలంటూ ఈ సందర్భంగా టిడిపి నేతలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజగోపాల్ నడుమూరు సర్పంచ్ సంతోష్, మాజీ సర్పంచ్ మహేంద్ర, క్లస్టర్ ఇంచార్జ్ వేడి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -పలమనేరు రూరల్: వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా శుక్రవారం ఐఎంఏ తరపున గంగవరం, సాయి నగర్‌లో డాక్టర్ రాజారెడ్డి ఆస్పత్రిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ యుగంధర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. విచ్చేసిన షుగర్ పేషెంట్లు అందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించి నివారణ మార్గాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ రాజారెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

సమాజ సేవే ధ్యేయం..

ప్రజాశక్తి - పలమనేరు రూరల్ (గంగవరం): సమాజ సేవ అనే మహోన్నత మార్గంలో అంకితభావంతో ముందుకు సాగుతున్న సాహసి సమగ్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో, శుక్రవారం పలమనేరు రూరల్ మండలం కాలువపల్లి గ్రామంలో గిరిజన మహిళలు, వృద్ధుల కోసం విశేష సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భయ్యప్పగారిపల్లి పంచాయతీకి చెందిన ఆరు గ్రామాలనుంచి దాదాపు 250 మంది గిరిజన మహిళలు, వృద్ధులకు అధిక నాణ్యత గల పోలో డిజిటల్ ప్రింటింగ్ దుప్పట్లు ట్రస్ట్ సంస్థాపకుడు సామ్ కోటేశ్వర్ తో పాటు ట్రస్ట్ సభ్యుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. అన్నదాన సేవలో పాల్గొని, తమ చేతుల మీదుగా భోజనం వడ్డించడం విశేషం. శీతాకాలంలో మన గిరిజన సోదర సోదరీమణులకు దుప్పట్లు రూపంలో వెచ్చదనం మాత్రమే కాదు, ప్రేమ, గౌరవం, ఆత్మీయతను పంచడం ఈ సేవా కార్యక్రమ ప్రధాన లక్ష్యం అని ఆ సంస్థ వ్యవస్థాపకులు అన్నారు.

పేదలకు వైద్య విద్యను దూరం చేయొద్దు: వైసిపి

ప్రజాశక్తి - రొంపిచెర్ల : కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం చేయవద్దని వైసిపి రొంపిచెర్ల గ్రామపంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఎల్. మహబూబ్ బాషా కోరారు. శుక్రవారం మండలంలోని రొంపిచెర్ల గ్రామ పంచాయతీ, ముత్యాలమ్మ గుడి వీధిలో కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడం తగదని పేదలకు వైద్య విద్యను దూరం చేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అల్లాబక్షు, మంజూర్, గురునాథ్, ఓబులేష్, బావాజీ సాహెబ్, ఐదియా కాలేషా, ఖలీల్, బరకత్, బబ్లూ పాల్గొన్నారు.

వరసిద్ధి వినాయకుని హుండీ ఆదాయం రూ.కోటి 76 లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి హుండీ లెక్కింపు ద్వారా 28 రోజుల పాటు వచ్చిన హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. హుండీ ద్వారా 1,76,77,666 రూపాయలు ఆదాయం వచ్చిందని ఆలయాధికారులు తెలిపారు. 53.గ్రాముల బంగారం, 790 గ్రాముల వెండి, గో సంరక్షణ హుండీ ద్వారా 15,103 రూపాయలు ఆదాయం వచ్చిందని దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెంచల కిషోర్ తెలిపారు. నిత్య అన్నదానం హుండీ ద్వారా 21,673 రూపాయలు వచ్చిందని పేర్కొన్నారు. దీంతో పాటు విదేశీ కరెన్సీ వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఈఓ సాగర్ బాబు, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ప్రసాద్, ధనపాల్, ధనంజయ, సిఎఫ్ఓ నాగేశ్వరరావు, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్ బాబు, హుండీ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం నాయుడు, దేవస్థానం సిబ్బంది, సేవకులు, యూనియన్ బ్యాంక్ కాణిపాకం శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త నిబంధనలు లిఖించారా?

- యూరియా బస్తాలు టీడీపీకి 4, వైసీపీకి 1 ఇవ్వాలని ప్రభుత్వం చెప్పిందా?
- కోర్టు కేసులో ఉన్న భూములకూ అనుభవదారు సర్టిఫికెట్ ఇచ్చేస్తారా..
- సర్వసభ్య సమావేశంలో నిలదీత
- రసాభాసగా మండల సమావేశం

ప్రజాశక్తి - విజయపురం : 'విజయపురం మండలంలో కొత్త నిబంధనలు లిఖించారా? యూరియా బస్తాలు టిడిపికి నాలుగు, వైసిపికి ఒకటి ఇవ్వాలని ప్రభుత్వం చెప్పిందా?' తహశీల్దారును ఎంపిటిసి నిలదీశారు. మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ మంజు బాలాజి అధ్యక్షతన ఎంపీడీవో రాజేంద్ర నిర్వహించిన సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. సమావేశంలో పలు అంశాలపై ఎంపీటీసీ రాజగోపాల్ తహశీల్దారు కిరణ్‌పై విరుచు కుపడ్డారు. పలు అంశాలపై ప్రశ్నల అస్త్రాన్ని సంధించారు. ఎంపీడీవో సమావేశాన్ని ప్రారంభించి విభాగాల వారీగా అధికారులు అభివృద్ధి పనులు వివరించాలని కోరారు. దీంతో వ్యవసాయ అధికారి వ్యవసాయ శాఖలో చేపడుతున్న పనులను వివరించగా దీనిపై ఎంపీటీసీ రాజగోపాల్ మాట్లాడుతూ యూరియా బస్తాలు అందరికీ సమానంగా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మాకైతే ఒక బస్తా, అధికార పార్టీకి అయితే 4 బస్తాలా? ఇలా ఇవ్వమని ప్రభుత్వం చెప్పిందా? ఇప్పటి వరకు వేరుశనగ విత్తనాలు ఎందుకు ఇవ్వలేదు? అని నిలదీశారు. ఎవరికీ అలా చేయలేదని అందరికీ సమానం గానే ఇచ్చామని వాటి వివరాలు అందిస్తామన్నారు. రెవెన్యూ శాఖ తరపున తహశీల్దారు వివరాలు చెప్పేందుకు ప్రయత్నించగా ఎంపీటీసీ రాజగోపాల్ ఆయనను ఉద్దేశించి పలు ప్రశ్నలను సందించారు. 2014 నుంచి ఓఎస్ నెంబరు 282 మేరకు కోర్టు వివాదాల్లో ఉన్న భూమికి అనుభవదారు సర్టిఫికేట్ ఎలా ఇస్తారన్నారు. ఇద్దరికి సంబంధించి విచారణ కోర్టులో జరుగుతుంటే ఒకరిని బెదిరించి స్టేట్‌మెంట్ ఎలా తీసుకుంటారన్నారని ప్రశ్నించారు. తహసీల్దారు మాట్లాడుతూ కోర్టులో కేసుంటే సర్టిఫికేట్ ఇవ్వకూడదన్న రూల్ ఉందా?' అంటూ ఎదురు ప్రశ్న వేశారు. కోర్టును ధిక్కరిస్తారా? ఈ అంశంపై నేను కోర్టుకెళతా అని ఎంపీటీసీ ప్రశ్నించగా వెళ్లు కోర్టులో నేను చూసుకుంటా..' అని తహశీల్దారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహారాజపురం క్వారీలకు ఎన్‌వోసీ ఎలా ఇచ్చారు. ఆ ఎన్‌వోసీ అంతా తప్పులతడగా వుంది? క్వారీలకు ఇచ్చిన సర్వే నెంబర్లు 190/4, 190/5, 190/6, 109/7, 190/8 చదునైన ఎర్రమట్టి భూములుగా ఉండి, పలు వృక్షాలు, వనమూలిక లు కలిగివుండి, మూగజీవాలకు జీవనాధారంగా ఉంటే దానికి గుయలకొండ అని ఎన్‌వోసీలో పేర్కొన్నారు? అలాంటి కొండ విజయపురం మండల పరిధిలోనే లేదు. క్వారీ ఇచ్చిన ప్రాంతానికి రెండు కిలోమీటర్ల వరకు ఎవరూ లేరని ఎన్‌వోసీలో పేర్కొన్నారు. మీ కంటికి అక్కడున్న ఎస్టీ కాలనీ, అందులో నివసించే ప్రజలు, ఇంజనీరింగ్ కళాశాల కనిపించ లేదా? మూగ జీవాలకు జీవనాధారమైన ప్రాంతాన్ని క్వారీలకు ఇచ్చేస్తే వాటికి మేత ఎక్కడినుంచి తేవాలి? అంటూ వరుస ప్రశ్నలను సంధించారు. తహశీల్దార్ మాట్లాడుతూ నిబంధనలు అన్నీ పరిశీలించే అనుమతి చ్చామన్నారు. ఎంపీటీసీ మాట్లాడుతూ 'విజయ పురం మండలానికి విడిగా నిబంధనలు లిఖించుకున్నారా?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్న తహశీల్దారుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకునేలా సర్వసభ్య సమావేశంలో తీర్మానించి పంపాలంటూ ఎంపీపీకి, ఎంపీడీవోకి వినతిపత్రం అందించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఎంపీటీసీ ఇచ్చిన వినతిపత్రంపై పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఇంద్ర ప్రియదర్శిని, పిఆర్ ఏఈ వీరభద్ర, పంచాయతీ కార్యదర్శులు, ఎంఈఓ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, ఎలక్ట్రికల్ ఏఈ ,సింగిల్ విండో అధ్యక్షులు బాబు, అంగన్‌వాడీ సూపరువైజర్లు లక్ష్మి, శ్యామల పాల్గొన్నారు.



తహశీల్దారును నిలదీస్తున్న దృశ్యం

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్‌డివో

ప్రజాశక్తి - చిత్తూరు (యాదమరి): పఠనాసక్తి పెంచడం గ్రంథాలయ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆర్‌డివో కార్యాలయం పక్కనే వున్న జిల్లా గ్రంథాలయ సంస్థ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చిత్తూరు ఆర్డీవో హాజరయ్యారు. జాతీయ బాలల దినోత్సవం, గ్రంథాల వారోత్సవాలు సందర్భంగా, ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ముఖ్య అతిథి ఆర్‌డివో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు, చిన్నపిల్లలకు ఉపయోగ పడేలా పుస్తకాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాను వారానికి మూడు రోజులు గ్రంథాలయాలకు వెళ్లి అర్ధ రోజు పుస్తకాలు చదువుకోవడం వల్లే ఈ స్థాయికి చేరానని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్ ఎస్ శర్మ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని బ్రాంచ్ లైబ్రరీలలో వివిధ పోటీ పరీక్షల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం ఆర్‌డివో ర్యాలీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యంవి శ్రీధర్ రెడ్డి, అధ్యక్షులు, లయన్స్ క్లబ్ చిత్తూరు, సంబంధిత అధికారులు విద్యార్థినివిద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంఈఓ నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండల కేంద్రం గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన కాలం నుండి గ్రంథాలయా పుస్తకాల వల్ల విజ్ఞానవంతులు అయ్యారని గ్రంథాలయాల్లో దినపత్రికలు, వారపత్రికలు, పక్ష పత్రికలు ,మాస పత్రికల ,వివిధ సంస్కృతికి సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంటాయని వాటిని చదవడం వలన విజ్ఞానవంతులు కావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 రమేష్‌బాబు, ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, ఉపాధ్యాయులు రామకృష్ణం రాజు, సిఆర్‌పి సుశీల, విశ్రాంతి ఉపాధ్యాయులు జోహార్ విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.


బంగారుపాళ్యంలో


కుప్పంలో

కుప్పం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథా లయాల్లో కొత్త సమయం గడపాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఎమ్మెల్సీ శ్రీకాంత్ చేతుల మీదుగా బహుమతులను అందించారు. కుప్పంలో ఆధునిక వసతులతో ప్రజలకు విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా నూతనంగా గ్రంథాలయ భవనాన్ని నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్,గుడిపల్లి మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం,కౌన్సిలర్లు జిమ్ దాము, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, లైన్స్ క్లబ్ సలహాదారుడు మహేష్, గ్రంథాలయ అధికారిణి సత్య వాణి పాల్గొన్నారు.

చౌడేపల్లి: గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిం చారు. ముఖ్య అతిథులుగా ఎంఈవో తిరుమల, జడ్పీహెచ్ఎస్ స్కూల్ సీనియర్ ఉపాధ్యాయులు పరిమళ, విశ్రాంత ఉపాధ్యాయులు బి కృష్ణారెడ్డి, రామసుబ్బయ్య, లైబ్రేరియన్ సోమశేఖర్, జడ్పీహెచ్ఎస్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



ఆహార నియమాలతో మధుమేహం నియంత్రణ

ప్రజాశక్తి-ఐరాల: ఆహార నియమాలతో మధుమేహం నియంత్రణ సాధ్య మవుతుందని డాక్టర్ రెడ్డప్ప పేర్కొన్నారు. ఐరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ మధుమేహ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ప్ల కార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఆహార నియమాలు పాటిస్తే నియంత్రణ సాధ్యమవుతుందని డాక్టరు తెలిపారు. దీని వల్ల పలు రకాల వ్యాధులు వచ్చే ప్రమాదం వుందన్నారు. ప్రజలలో అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరువైజరు చిన్నమ్మ, మేల్ హెల్త్ అసిస్టెంట్ మునిరత్నం, ఎంఎల్ హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తీర్థంప్రాంగణంలో ప్రపంచ మధుమేహ నివారణ దినోత్సవం పురస్కరించుకుని డాక్టరు పద్మావతి ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ కాంతమ్మ, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీపతి, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రపంచ మధుమేహ దినోత్స వంపై అవగాహన, ఉద్యోగులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గిరి, డాక్టర్ అనూష, డాక్టర్ నవీన్ తేజ్ రాయ్, శ్రీవాణి, రోజా రాణి, కిరణ్ కుమార్, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'చలో మదనపల్లి'ని జయప్రదం చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

ప్రజాశక్తి - రొంపిచర్ల: ఈ నెల 16వ తేదీ నిర్వహించనున్న 'చలో మదనపల్లె' మాలమహానాడు రాష్ట్ర సభను విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ నెల 16వ తేదీ అన్నమయ్య జిల్లా మదనపల్లి సిఎస్ఐ, జెసిఎం హాలు నిర్వహించనున్న రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని కోరుతూ రొంపిచెర్ల మండలం బొమ్మయ్యా గారి పల్లి పంచాయతీ గుట్ట కింద పల్లిలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ శుక్రవారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలమహానాడు తన లక్ష్యాలను సాధించ డానికి ఈ సభ ఒక వేదిక కానుందని 2011 జనాభా లెక్కల ఆధారంగా అశాస్త్రీయంగా, కుట్రపూరిత విధానాలతో ఎస్సీ వర్గీకరణ చేశారన్నారు. దీన్ని నిరసిస్తూ రాష్ట్ర మాల మహానాడు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసనలు తెలపడం తో పాటూ మాలలపై చోటు చేసుకుంటున్న దాడులు, సాంఘి క బహిష్కరణలు వంటి ఘోర విపత్తులు విచారకర మని ఆవేదన వ్యక్తం చేశారు. మహా సభలకు ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళ నాడు, రాష్ట్రాల లోని మాల మేధావులు, సామాజిక కార్యకర్తలు పాల్గొంటారని ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మాలలు ఆత్మగౌరవంతో తమ హక్కుల సాధనకు మాలమహానాడు రాష్ట్ర మహా సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీలేరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్, డిబియస్‌యఫ్, ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు బద్దె భాను ప్రకాష్, నాగరాజు, ముత్యాలు, దొరస్వామి, శ్రీనివాసులు, గీతా, క్రిష్ణమ్మ, రెడ్డమ్మ, నరసింహులు, బాలు, మనోజ్, రెడ్డప్ప, వెంకటరమణ నడిపన్న, గంగులయ్య, సిద్దయ్య పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు అంగన్‌వాడీల అభినందనలు


ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-పలమనేరు: ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా ప్రమోట్ చేయడాన్ని అభినందిస్తూ పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని పలమనేరు, బైరెడ్డిపల్లి ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు శుక్రవారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. ఈ రెండు ప్రాజెక్టులకు మొత్తం 92 కేంద్రాలు ఉండగా అన్నింటిని మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చడంతో తమకు రూ. 7 వేల గౌరవ వేతనం నుంచి రూ. 11,500 వేలకు పెరిగిందని ఇది చాలా సంతోషకరమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల నిర్వాహకులకు ఆయన ప్రభుత్వ ఉత్తర్వులను అందించారు. తమ డిమాండ్లలో ఇంకా కొన్నింటిని ప్రభుత్వం పరిష్కరించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. దీంతో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి చంద్రబాబు మహిళలకు పెద్దపీట వేశారన్నారు. నేడు రాష్ట్రంలో మహిళలకు అందిస్తున్న పథకాలు, వారి పట్ల ప్రభుత్వం చూపుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వానికి అందరూ సహకరించాలని కోరారు. భవిష్యత్తులో సమస్యల మిగిలిన పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపివోలు ఉమారాణి, అరుణశ్రీ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు జ్యోతి, శాంతి, సూపరువైజర్లు మధులత, గీతమ్మ, లత, నజ్మ, సునీత, కల్పన, స్వర్ణ లత, రమాదేవి పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్ట్‌కి విరాళం

ప్రజాశక్తి-ఐరాల: వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం గో సంరక్షణ ట్రస్ట్ కి విరాళం 1,01,116 రూపాయలు విరాళాన్ని దాత వెంకట్ కుమార్ డిడి ద్వారా శుక్రవారం అందించారు. తిరుపతికి చెందిన వారికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు రవీంద్ర బాబు, ధనపాల్, సిఎఫ్ఓ నాగేశ్వరరావు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు పాల్గొన్నారు.



విద్యార్థులకు నీతి పుస్తకాలు పంపిణీ చేసిన దాతలు

నీతి పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని పుల్లూరు, పాతపాలెం గిడ్డ మాహారాజపురం, నెలవాయి, కొల్లాగుంట ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కోశాధికారి పైనేని మురళి విద్యార్థిని విద్యార్థులకు నీతి పద్యాల పుస్తకాలను, తెలుగు సాహిత్య పుస్తకాలు, నేతి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు హిమాచలపతి ,సాధన కుమార్, దీనావతి, శివ, హేమలత ,పైనేని మురళి, మిత్రులు బాబు నాయుడు, తులసి యాదవ్ పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ ప్రశాంతి ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా శ్రీపురం సీతారామయ్య విచ్చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి చేయూత



ప్రజాశక్తి-చౌడేపల్లి: మండలంలోని శెట్టిపల్లి పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేకలచిన్నేపల్లి పూర్వ విద్యార్థి కొత్తపల్లి సదాశివ రెడ్డి ఆ పాఠశాలకు చేయూత అందించారు. లక్ష రూపాయలతో సైకిల్ స్టాండు నిర్మించి బాలల దినోత్సవం సందర్భంగా బహుమతిగా అందించారు. ఈ పాఠశాలలో 2008లో చదివి, సాఫ్ట్‌వేర్‌గా పని చేస్తున్న కొత్తపల్లి సదాశివరెడ్డి చదివిన పాఠశాలకు ఏదో ఒకటి చేయాలనే మంచి ఉద్దేశంతో విద్యార్థుల సౌకర్యార్థం దాదాపు లక్ష రూపాయల వ్యయంతో సైకిల్ స్టాండ్ షెడ్ ను నిర్మించి బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా సదాశివ రెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తరపున ఘనంగా సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, దాత నారాయణ రాజు , ఉపాధ్యాయులు లింగమూర్తి, గోవింద్ రామకృష్ణ, విజయశ్రీ, మోహన్, నాగ మునికృష్ణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బోయకొండ ఉద్యోగిణి ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయంలో పనిచేస్తున్న ఉద్యోగిణి ఆకస్మిక మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. నెమ్మనిపల్లి మండలం బండ్ల పైకి చెందిన గంగమ్మ(45) అమ్మవారి ఆలయంలో 20 సంవత్సరాలుగా స్వీపర్‌గా పనిచేస్తోంది. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను తిరుపతి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి గంగమ్మ మృతి చెందింది. ఆమె మృతి పట్ల బోయకొండ ఆలయ అధికార అర్చక సిబ్బంది విచారం వ్యక్తం చేశారు. తక్షణం అంత్యక్రియలకు దేవస్థానం తరపున రూ. పదివేలు అందించారు.

పంట నమోదుతో రైతులకు లబ్ధి

ప్రజాశక్తి- రామకుప్పం: రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవడం వల్ల ప్రభుత్వం అందించే పలు పథకాల లబ్ధి చేకూరుతుందని కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు పేర్కొన్నారు. మండలం లోని మిట్టపల్లి వద్దనున్న రామకుప్పం-2 రైతు సేవా కేంద్రం వద్ద రైతులతో సమావేశమయ్యారు. ఈ పంట నమోదు సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభలో వక్తలు మాట్లాడుతూ.. తాము పండించే పంటలన్నింటినీ తప్పకుండా ఈ పంట ఆన్లైన్ లో నమోదు చేయించాలని రైతులను కోరారు. ఈకార్యక్రమంలో టిడిపి మండల మాజీ కన్వీనర్ ఆంజనేయ రెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కామరాజ్ నాయక్, నరసింహులు, ఏ ఎం సి డైరెక్టర్ మునీంద్ర నాయక్ ఆంజనేయప్ప, నియ్యు సాబ్, వ్యవసాయ శాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : గంగాధర్ నెల్లూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ వివిఎం థామస్ శనివారం మండలంలో పర్యటిస్తున్నట్లు ఎంపీడీవో వనజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకి ఎంపీడీవో కార్యాలయంలో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొంటారని అనంతరం మెదివాడ లో వర్షానికి ఇల్లు కూలిన మహిళకు ఆర్థిక సహాయం అందిస్తారని అన్నారు. పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు.

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - రొంపిచెర్ల : 175 పశువులకు ఉచిత వైద్య సేవలు అందించినట్లు రొంపిచెర్ల మండల పశువైద్యాధికారిణి డాక్టర్ ఉష తెలిపారు. రొంపిచెర్ల మండలంలోని బండకింద పల్లి గ్రామ పంచాయతీ, మట్లోళ్లపల్లిలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 122 పశువులకు పిడుదుల మందు, 36 దూడలకు నట్టల నివారణ మందు పంపిణీ, 17 పశువులకు గర్భ కోశ వ్యాధులకు చికిత్స అందించామన్నారు. మినరల్ మిక్చర్ ప్యాకెట్లు పంపిణీ చేశామన్నారు. పశువైద్యాధికారులు ఉష, చిరంజీవి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

మహిళ ఆత్మహత్య కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -యాదమరి: మహిళ ఆత్మహత్యకు కారకులైన ఓ వ్యక్తిని యాదమరి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. 2024 సంవత్సరంలో పాచిగుంట గ్రామానికి చెందిన కీర్తనకు వివాహమైంది. ఇటీవల కీర్తన వారి గ్రామ శివారులో బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. అదే గ్రామానికి చెందిన వసంత్ కుమార్ ఆమెను మానసికంగా వేధించడం వల్లే ఆత్మహత్య చేసుకుందని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగించారు. అప్పటి నుండి వసంత్ కుమార్ తప్పించుకొని తిరుగుతూ ఉండగా శుక్రవారం అతడిని ఓటేరుపల్లి క్రాస్ దగ్గర అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

మహిళ మృతి, మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: కారు కారు అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, మరొకరు గాయపడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. చిత్తూరు నుంచి గంగాధర నెల్లూరుకు వస్తున్న కారు ఠాణా పెట్రోల్ బంక్ సమీపంలో అదుపుతప్పి ఎడమ నుండి కుడివైపునకు దూసుకెళ్లింది. అదే సమయానికి ఈ కారుకి ఎదురుగా వస్తున్న తమిళనాడు కుండలూరు గ్రామానికి చెందిన రఘు (59), మీరా (50) చిత్తూరులో భవన నిర్మాణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా కారు వారి వాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ రఘు, మీరాను అంబులెన్స్ లో చిత్తూరు ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ డాక్టర్ పరిశీలించి అప్పటికే మీరా మరణించినట్లు తెలిపారు. గాయపడ్డ రఘు ఫిర్యాదు మేరకు గంగాధర నెల్లూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కేసుల కొట్టివేతతో ఆనందం వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి నేతలపై కేసులు కొట్టివేత

ప్రజాశక్తి -కుప్పం, శాంతిపురం: కుప్పం టిడిపి నేతలపై నమోదు అయిన రెండు కేసులను చిత్తూరు కోర్టు శుక్రవారం కొట్టివేసింది. ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు రామకుప్పం మండలం కొల్లుపల్లి గ్రామంలో పర్యటించినప్పుడు చోటు చేసుకున్న ఘటనలు నేపథ్యంలో 36 మంది టిడిపి నేతలపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ఈ కేసులకు సంబంధించి అప్పట్లో ఏడుగురు టిడిపి నేతలను అరెస్టు చేసి చిత్తూరు జైలుకు తరలించారు. జైల్లో ఉన్న టిడిపి నేతలను నారా లోకేష్ తో పాటు చంద్రబాబు చిత్తూరు జైలుకు వెళ్లి పరామర్శించారు. అయితే సుమారు మూడు ఏళ్లుగా ఈ కేసులకు సంబంధించి టిడిపి నేతలు కోర్టులు చుట్టూ తిరగ్గా శుక్రవారం చిత్తూరు కోర్టు రెండు కేసులను కొట్టివేస్తూ టిడిపి నేతలు నిర్దోషులుగా ప్రకటించింది. అయితే ఇదే ఘటనకు సంబంధించి మరో కేసు హైకోర్టులో విచారణలో వుంది. టిడిపి నేతలపై పెట్టిన తప్పుడు కేసులను కోర్టు కొట్టి వేయడంపై మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, టిటిడి బోర్డు సభ్యుడు శాంతారాం, కడ అడ్వైసర్ కమిటీ సభ్యుడు రాజ్ కుమార్, మాజీ ఏంసి చైర్మన్ సత్యేంద్ర శేఖర్, నాయకులు విశ్వనాథ్ నాయుడు, ఆర్ఆర్ రవి, అప్పు, ఎల్లప్ప, మునెప్ప, ప్రజలు పాల్గొన్నారు.

తెలుగు యువత అధ్యక్షుడిగా ప్రశాంత్



ప్రజాశక్తి-కుప్పం: కుప్పం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడిగా కుప్పం మున్సిపాలిటీ శీగలపల్లికి చెందిన ప్రశాంత్ నియవి ఎతు లయ్యారు. టిడిపి విద్యార్థి విభాగం నాయ కుడిగా పార్టీలో చురుగ్గా ఉన్న ప్రశాంత్‌కు తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడి బాధ్యతలను అప్పగించారు. తనపై నమ్మకంతో నియోజకవర్గం కల్పించిన టిడిపి నేతలకు ప్రశాంత్ ధన్యవాదాలు తెలిపారు. ప్రశాంత్ నియామకం పట్ల టిడిపి నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రం సదుంలోని ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులకు ఎంపీడీవో రాధా రాణి, ఎస్ఐ షేక్షావలి చేతుల మీదుగా దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ షరీఫ్ బాష మాట్లాడుతూ వసతి గృహం లోని 70 మంది విద్యార్థులకు చలికాలంలో చలితో ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం దుప్పట్లను సరఫరా చేసిందని, వసతి గృహ విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందజేస్తున్నామని విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని కోరారు.

ఘనంగా నెహ్రూ జయంతి

ప్రజాశక్తి-కుప్పం: భారత దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 136వ జయంతి వేడుకలను కుప్పం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి దేశ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియా డారు. కార్యక్ర మంలో ఆ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.